www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 మే 2025

5

తూర్పుగోదావరి




ప్రయివేటు పాఠశాలలపై సమీక్ష

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలో ఉన్న 17 ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో ఎంఇఒలు ఎం.తిరుమలదాస్, కెఆర్ఎస్‌వి.అప్పారావు ఆధ్వర్యంలో ఎంపిపి కెవికె.దుర్గారావు శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రయివేటు పాఠశాలల్లో ఒకటో తరగతికి కేటాయించిన 25 శాతం ఉచిత సీట్లు పేద విద్యార్థులకు అందేలా చూడాలని ఎంపిపి సూచించారు. ఒకటో తరగతిలో జాయిన్ అయిన ప్రతి విద్యార్థి 10వ తరగతి వరకు ఉచితంగా చదవవచ్చని, అర్హులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు బస్సులకు మరమ్మతులు, తరగతి గదుల అభివృద్ధి, తాగునీరు, క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

పదేళ్లలో నాలుగింతలు

- ఈ ఏడాది భారీగా పెరిగిన పసిడి ధరలు
- కొనుగోలుకు సామాన్యులు వెనకడుగు
- కార్పొరేట్ రాకతో స్థానిక షాపులు వెలవెల



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

బంగారం ధర పదేళ్లలో నాలుగింతలైంది. ఈ ఏడాది రూ.లక్ష దాటి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం స్వల్పంగా తగ్గుదల ఉన్నా... ఇది తాత్కాలికమే అంటున్నారు వ్యాపారులు. రాబోయే కాలంలో పెరగడమే తప్ప తగ్గే అవకాశం ఉండదంటున్నారు. సామాన్యులు కొనలేని స్థాయికి నేడు బంగారు ధర చేరింది. ధనిక, పేద అనే తేడా లేకుండా పెళ్లిళ్ల, శుభకార్యాలు అంటే ముందుగా గుర్తుకొచ్చేది బంగారమే. ధనవంతులు కాస్త ఎక్కువగా, మధ్య తరగతి ప్రజలు వారి స్థోమతకు తగ్గట్టుగా బంగారు నగలను కొనుగోలు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది పసిడి ధరలు అందనంత ఎత్తుకు చేరాయి. ఎప్పటికప్పుడు పసిడి ధరలు ఆల్‌టైం రికార్డులను నమోదు చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇన్వెస్టర్లు బంగారంపై ఉంచు తున్నారు. అమెరికా, చైనా దేశాల మధ్య జరుగుతున్న ఆర్థిక యుద్ధం నేపథ్యంలో దేశంలో బంగారు ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయి. అయితే ఈ ఏడాది బంగారం గ్రాము ధర రూ.9,878గా ఉంది. గడిచిన పదేళ్లలో గ్రాముకు రూ.7078 పెరిగింది. వెండి ధరలు సైతం పరుగులు పెడుతున్నాయి. గడిచిన 50 ఏళ్లలో పెరిగిన ధర ఒక ఎత్తయితే ఈ పదేళ్లలో పెరిగిన ధర అధికం అనడంలో ఎం మాత్రమూ అతిశయోక్తికాదు. బంగారం ధరల పెరుగుదల, మరో వైపు కార్పొరేట్ సంస్థలు రాకతో స్థానిక వ్యాపారాలు పూర్తిగా వెల వెల బోతున్నాయి. ఆభరణాల తయారీ కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుంటూ వలసలు వెళ్లిపోతున్నారు.

రాజమహేంద్రవరంలో 200లకు పైగా షాపులు

అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య పోరుతో పాటు డాలర్ బలహీనపడడం వంటి కారణాలతో మదుపరులు బంగారం వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే కాకుండా ప్రభుత్వం గోల్డ్ నిల్వలు పెంచుకుంటూ ఉంది. యుఎస్ ఎకానమీ పడిపోవడం, డాలర్ మీద నమ్మకం సన్నగిల్లడంతో బంగారంపై పెట్టుబడులు పెట్టడం ప్రత్యామ్నాయంగా మారింది. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం 3,319 డాలర్లకు చేరువలో ఉంది. బంగారం ధర రోజు రోజుకు పెరుగుతుండటంతో మార్కెట్ వెలవెలబోతోంది. గడిచిన వారంలో పసిడి ధర గ్రాముకు రూ.200పైనే పెరిగింది. గత ఏడాది చాలాకాలం గ్రాము బంగారం రూ.5400 నుంచి రూ.5900 మధ్యనే ఉంది. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల ప్రభావం బులియన్ మార్కెట్‌పై చూపింది. దీంతో ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరగడంతో ధర ఆకాశాన్ని అంటింది. జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం పట్టణాల్లో అత్యధికంగా బంగారం దుకాణాలు ఉన్నాయి. అత్యధిక వ్యాపారం రాజమహేంద్రవరంలో జరుగుతోంది. మెయిన్ రోడ్డు, గోకవరం బస్టాండ్, ఎవి అప్పారావు రోడ్డు తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలు, ఇతర చిన్న షాపులు కలిపి 200పైగా ఉన్నాయి. ప్రస్తుతం ధర పెరగటంతో వినియోగ దారులు కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రానున్న రోజుల్లో ధర మరింత తగ్గు తుందన్న ఆశతో అవసరం ఉన్నా ఆ స్థాయిలో కొనుగోలు చేయడం లేదు. దీంతో జ్యూయలరీ షాపుల్లో సందడి కనిపించడం లేదు. దీనికి తగ్గట్టు వెండి కూడా దూసుకుపోతోంది.

పెళ్లిళ్ల సీజన్ అయినా కొరవడిన సందడి

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో కళ కళలాడాల్సిన బంగారం షాపులు వెలవెల బోతున్నాయి. ఓ వైపు ధరలు పెరగటం మరో వైపు, కార్పొరేట్ సంస్థలు రాక ప్రధాన కారణమని జ్యూయలరీ షాపుల యజమానులు చెబుతున్నారు. 2013లో రూ.2,920 ధర ఉండేది. 2014లో రూ.2,800, 2015లో రూ.2,634, 2016లో రూ.2,862కు చేరింది. 2017లో రూ.2,900, 2018లో రూ.3,000, 2019లో రూ.3,200చేరింది. 2020లో రూ.3,50 నుంచి రూ.4200, 2021లో రూ.4,800, 2022 రూ.5,300, 2023లో రూ.6,200 చేరింది. తాజాగా రూ.7450కి చేరింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో సుమారు 10 వేలకు పైగా కార్మికులు ఆభరణాల తయారీ రంగంలో ఉపాధి పొందేవారు. ఈ రంగంలో ఆధునిక సాంకేతిక పరికరాలు రావటం, ధరలు పెరుగుదల, కార్పొరేట్ సంస్థలు రెడీమేడ్ వ్యాపారం ప్రారంభించటంతో కార్మికులకు ఉపాధి కొరవడింది. దీంతో సుమారు 40 శాతం మంది ఇతర రంగాలకు తరలి వెళ్లినట్లు జ్యూయలరీ వర్కర్స్ చెబుతున్నారు. బంగారు ఆభరణాల కోసం ఇతర జిల్లాల నుంచి సైతం గతంలో రాజమహేంద్రవరం వచ్చే వారని ప్రస్తుతం స్థానికులు సైతం రెడీమెడ్‌పై ఆసక్తి చూపిస్తున్నారని తెలుస్తోంది.

బంగారం ధరలు క్రమంగా పెరుగుదల

బంగారం ధరలు క్రమ క్రమంగా పెరగటమే తప్ప తగ్గే పరిస్థితులు కన్పించటంలేదు. రాజమహేంద్రవరంలో కిరాణా స్టోర్స్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాను. ప్రతి సంవత్సరమూ అక్షయ తృతీయ, సంక్రాంతి, దసరా పండుగకు బంగారం ఆభరణాలు కొనుగోలు చేస్తుంటాను. గత ఐదేళ్లలో ధరలు విపరీతంగా పెరగటంతో వెనకడుగు వేయాల్సి వస్తోంది. గతంలో తయారీ చేయించే వాళ్లము. ప్రస్తుతం మోడల్స్ అందుబాటులో ఉండటంతో రెడీమేడ్ కొంటున్నాము.

- కె.వెంకటేశ్వరరావు సీతం పేట, రాజమహేంద్రవరం

ఆభరణాల వ్యాపారం ఆశాజనకంగా లేదు

బంగారు ఆభరణాలు తయారీ, విక్రయం రంగంలో గత మూడు దశాబ్దాలుగా పని చేస్తున్నాను. గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో విరివిగా ఆర్డర్లు వచ్చేవి. మా కుటుంబంతో పాటు మరో ఐదుగురు మా షాపులో ఉపాధి పొందేవారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా తలకిందులయ్యాయి. కార్పొరేట్ సంస్థలు గడిచిన ఐదేళ్లలో 5కు పైగా భారీ షాపులు ఏర్పాటు చేశాయి. దీంతో స్థానిక వ్యాపారాలు పడిపోయాయి. పండుగలకు, గతంలో తయారీ చేయించే వారు సైతం ప్రస్తుతం రెడీమేడ్ కొనుగోలు చేయటంతో ఉపాధి కొరవడింది.

- కె.భాస్కరాచారి, మెయిన్ రోడ్డు



ఆర్ఎస్‌కెకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రైతు సేవా కేంద్రానికి తాళాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దాళ్వా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గత కొన్ని రోజులుగా జరుగుతున్న నిర్లక్ష్యంపై ఆగ్రహించిన రైతన్నలు రైతు సేవా కేంద్రానికి శనివారం తాళాలు వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. మండలంలోని పసలపూడి గ్రామ రైతులు శనివారం రైతు సేవా కేంద్రానికి తాళాలు వేసి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన పలువురు రైతులు కళ్లాలలో ఉన్న తమ ధాన్యం ఎవరు కొంటారని కొనుగోలు కేంద్రం సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో ఆర్ఎస్‌కెకు తాళం వేసిన సంగతిని వ్యవసాయ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహశీల్దార్ పిఎస్‌డి. ప్రసాద్ ఆర్ఎస్‌కె వద్దకు చేరుకున్నారు. రైతులతో మాట్లాడారు. రబీ సీజన్‌లో మండలంలో 11 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశామని, 45 వేల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని రైతులు వివరించారు. ఇప్పటికే సుమారు 18 వేల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని, అయితే గత కొన్ని రోజులుగా ఆర్ఎస్‌కెలో నిర్దేశించిన ధాన్యం కొనుగోలు లక్ష్యాలు పూర్తి అయ్యాయని, ఇకపై ధాన్యం కొనుగోలు చేయడం కుదరదని చెబుతున్నారని, కళ్లాల్లో ఉన్న ధాన్యంకు చెందిన రైతులు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డాంభికాలు పలికిన ప్రజాప్రతినిధులు నేడు మిన్నకుండిపోతున్నారని రైతులు విమర్శించారు. ఆరుగాలం శ్రమించి, పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే తమ పరిస్థితి ఏమిటని రైతులు నిలదీశారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులకు విక్రయించాలంటే 75 కేజీల ధాన్యం వద్ద సుమారు రూ.250 వరకూ నష్టపోవాల్సివస్తుందని రైతు మన్నే రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహశీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ ఆర్ఎస్‌కెలో ధాన్యం కొనుగోలు నిలిపివేయడంతో రైతులకు ఇబ్బంది కల్గిన మాట వాస్తవమేనని, ఉన్నతాధికారులతో చర్చించి, సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు తక్షణ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ఆందోళనను విరమించారు.

'కార్పొరేట్'లో పేద విద్యార్థులకు అవకాశం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో పేద విద్యార్థులు కార్పొరేట్ స్కూల్లో చదువుకుని అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని ఎంఇఒలు బిబిఎస్. స్వరూప్, షేక్ సూర్జహాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 121 సి ప్రకారం పేద విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదవారి ఏడాది ఆదాయం రూ.2 లక్షలు మించకూడదని అన్నారు. అనాథలు, దీర్ఘకాలిక వ్యాధి బాధిత పిల్లలు, వికలాంగులకు 5 శాతం, ఎస్‌సిలకు 10 శాతం, ఎస్‌టిలకు 4 శాతం, బిసి, మైనారిటీ, ఒసిలకు 6 శాతం సీట్లు కేటాయిస్తారని తెలిపారు. ఒకటో తరగతిలో చేరే వారికి 25 శాతం సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గోరంట్ల

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి శంకుస్థాపనలు చేశారు. మరికొన్ని పనులను ప్రారంభించారు. శనివారం కడియం పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక గదులను, ఎపి పేపర్‌మిల్లు కడియం బ్రాంచ్ అందించిన ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషిన్‌ను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రూ.2.45 కోట్లతో నిర్మించే సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. సుబ్బారావు పేటలో రూ.76.50 లక్షలతో నిర్మించే వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెల్లి పేట, సుబ్బారావు పేట, భాస్కర్ నగర్‌లలో పలు సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఎంపిపి ప్రసాద్‌లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, నాయకులు మార్గాని సత్యనారాయణ, డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, చెల్లుబోయిన శ్రీనివాస్, ఆకుల శ్రీధర్, బోడపాటి గోపి, సర్పంచులు అన్నందేవుల చంటి, చెక్కపల్లి మురళీకృష్ణ, పాఠంశెట్టి రాంజీ, వైస్ ఎంపిపి పంతం గణపతి, ఎంపిడిఓ రమేష్, డిఇఇ రవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాధురి, విద్యుత్ శాఖ ఎస్ఇ తిలక్, ఇఇ శ్రీధర్‌వర్మ, ఎఇఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సరీ రైతుల కృషి అభినందనీయం

ప్రజాశక్తి - కడియం



బుర్రిలంకలో నర్సరీని పరిశీలిస్తున్న రాహుల్

కడియం నర్సరీ రైతుల కృషి అభినందనీయమని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ కొనియాడారు. శనివారం బుర్రిలంకలోని కొత్తపల్లి మూర్తి టాల్ బోన్సాయ్ ఉమా పార్వతి నర్సరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మూర్తి నర్సరీలో వందేళ్ల చరిత్ర కల్గిన వృక్షజాతి మొక్కలను ఎలా తయారు చేశారో, ఎలా పెంచాలో వివరించారు. వృక్షజాతి మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ దేశానికి, పర్యావరణానికి కడియం నర్సరీ రైతుల చేస్తున్న సేవలు చాలా విలువైనవని అన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఇటీవల కాలంలో నర్సరీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్, చిలుకూరి శ్రీనివాసరావు, సాధనాల బాబ్జి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కొవ్వూరు



ఆయా పోస్టుల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి శనివారం డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్‌డిఒ రాణిసుష్మిత అధ్యక్షతన కొవ్వూరు డివిజన్ పరిధిలోని 20 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ పెరవలి, గోపాలపురం, కొవ్వూరు మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న 20 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు 54 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆయా దరఖాస్తుదారుల సర్టిఫికెట్స్‌ను పరిశీలించి అభ్యర్థుల నివేదికను కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కె.విజయకుమారి, డిఎంహెచ్ఒ డాక్టర్ సంధ్య, సిడిపిఒలు డి.మమ్మీ, కె.నాగలక్ష్మి, సిహెచ్.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటా డాక్టర్ కార్యక్రమం

ప్రజాశక్తి - పెరవలి



టబ్‌ను అందిస్తున్న సర్పంచ్ నాగలక్ష్మి

కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉసులుమర్రులె శనివారం ఇంటింటి డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పి.తేజశ్రీ, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతలు, మంచాన పడ్డ రోగులను పరీక్షించి అవసరమైన మందులను పంపణీ చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న 12 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించిన టబ్బులు, మగ్గులు, సబ్బులు, ఆయింట్‌మెంట్స్, టవల్స్‌లను సర్పంచ్ వీరమళ్ళ నాగలక్ష్మి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జయమణి, సూపర్‌వైజర్ కెవి.నాగేశ్వరరావు, ఎఎన్ఎం సిహెచ్.అక్కమ్మ, హెల్త్ అసిస్టెంట్ జి.దుర్గాప్రసాద్, 104 సిబ్బంది సిహెచ్.అరుణ, ఎ.ఆసిఫ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పెరవలి పిహెచ్‌సి పరిధిలోని ముక్కామల గ్రామంలో వైద్యాధికారి ఎహెచ్.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు.

గ్రామాల్లో పరిశుభ్రతా దినోత్సవం

ప్రజాశక్తి - చాగల్లు




కూలీలతో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి

మండల పరిధిలోని పలు పంచాయతీలు, సచివాలయాల్లో శనివారం పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ తమ కార్యాలయాల్లో పరికరాలను ఉద్యోగులు, సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గౌరీపల్లి, మల్లవరం గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎన్.శ్రవణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు బిన్ బ్యాగ్ పద్ధతిని అవలంబించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా రాజీవ్‌కృష్ణ

ప్రజాశక్తి - నల్లజర్ల



నియామక పత్రాన్ని అందుకుంటున్న రాజీవ్‌కృష్ణ

తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా అల్లూరి రాజీవ్‌కృష్ణను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు టికె.విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజీవ్‌కష్ణ మాట్లాడుతూ తనపై పార్టీకి ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, శక్తి వంచన లేకుండా పార్టీ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు.

విద్యార్థిని వైద్యానికి ఆర్థిక సాయం


ప్రజాశక్తి - తాళ్లపూడి



విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

వాట్సాప్‌లో వచ్చిన సమాచారంపై స్పందించిన ఉపాధ్యాయులు ఒక విద్యార్థిని వైద్యం కోసం ఉపాధ్యాయులు ముందుకొచ్చి ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలం ప్రక్కిలంకలో ఎంపిపి ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న పాట్నూరి విజయలక్ష్మి నరాల వ్యాధితో బాధపడుతోంది. మరొకరి సహాయం లేకుండా నడవలేని స్థితిలో ఉంటూ వైద్య ఖర్చులకోసం ఎదురుచూస్తుంది. ఈ నేపథ్యంలోనే ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావుకు వాట్సాప్ ద్వారా సమాచారం వచ్చింది. దీంతో ఆయన మండల, జిల్లా స్థాయిలో ఉపాధ్యాయుల దృష్టికి విద్యార్థిని పరిస్థితిని తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పలువురు ఉపాధ్యాయులు, తాళ్లపూడికి చెందిన వసుంధర టైలర్స్, పైడిమెట్టకు చెందిన పాస్టర్ నానిబాబు, విజయనగరం జిల్లాలో స్టేట్ బ్యాంకులో పనిచేస్తున్న ఫణికుమార్ తదితరులు దుర్గారావు బ్యాంక్ ఖాతాకు కొంత నగదును జమ చేశారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఎపిటిఎఫ్ బృందం దాతల ద్వారా వచ్చిన రూ.43 వేలను విద్యార్థిని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి సనపల రాజశేఖర్, నాయకులు నాని, జానీ, పాఠశాల ఉపాధ్యాయులు కె.గణేష్, కె.శ్రీను, గ్రామానికి చెందిన నాయకులు యాళ్ళ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి



మాజీ మంత్రి వనితను సత్కరిస్తున్న వైసిపి నేతలు

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ మెంబర్‌గా నియమితులైన తానేటి వనితను శనివారం వైసిపి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, సత్తి సూర్య నారాయణరెడ్డి పాల్గొని వనితను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో సంక్షేమాన్ని ఇంటింటికీ అందించామని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చాయని, అయితే అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించి పాలన సాగిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రచార కమిటీ మాజీ అధ్యక్షులు తోట రామకృష్ణ, మాజీ ఉపాధ్యక్షులు గంట్రోతు సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, ఐటీ వింగ్ అధ్యక్షులు ఇంటి వీర్రాజు, గ్రీవెన్స్ అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నాయకులు, కార్యకర్తలు

దళిత యువకునిపై దాడికి కెవిపిఎస్ నిరసన

ప్రజాశక్తి - నిడదవోలు

తెలంగాణా రాష్ట్రంలో దళిత యువకునిపై విహెచ్‌పి, బిజెపి, ఆర్ఎస్ఎస్ గూండాలు దాడి చేయడాన్ని కులవివక్షత వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) తీవ్రంగా ఖండించింది. ఈ దాడిని ఖండిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఇందిరా నగర్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలోని చేర్యాల మండలం వెచరేణి గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందిన యువకుడితో జై శ్రీరామ్ అనాలని చిత్రహింసకు గురి చేయడం దారుణమన్నారు. ఆధునిక సమాజంలో ఇలాంటి దుర్మార్గాలు జరుగుతుంటే దేశం సిగ్గుపడాలని అన్నారు. మతం పేరిట హింసించటం అమానుషమని, దళిత యువకునిపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై.చంటి, ఆర్.సురేష్, వై రాజ్‌పాల్, ఎ.నానీ, తదితరులు పాల్గొన్నారు.

5న చివటంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చివటం జిసిఎం చర్చ్ వద్ద ఈ నెల 5వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు టి.అబ్బులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆశ్రం హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ఆర్థో, న్యూరో, జనరల్ మెడిసిన్, గుండె సంబంధిత వైద్య నిపుణుచే వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందిస్తారని అన్నారు. వైద్య పరీక్షలు, రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తామని, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా చేయిస్తాని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా చిలుకూరి

ప్రజాశక్తి - కడియం



కడియం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకుడు, స్వచ్ఛంధ సేవకుడు చిలుకూరి ప్రభాకర్ నియమితులయ్యారు. శనివారం ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో ప్రభాకర్ భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వెలుగుబంటి నానిలకు ఆయన కృతజ్ఞతులు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వేడెక్కుతున్న వాతావరణం

గోదారి గలగలలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒక పక్క ఎండలు... మరో పక్క కార్మికులు, స్కీమ్ వర్కర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది సమస్యలపై పోరాటాలతో ఉమ్మడి జిల్లాలో 'వాతావరణం' వేడెక్కుతోంది. కూటమి సర్కారు అవలంబిస్తున్న విధానాలు ప్రజలను సంతృప్తి పరచలేకపోతున్నాయి. ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకపోవడంతో పలు సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. కొన్ని విధానాల వల్ల కొన్ని వర్గాల ప్రజలు ఉపాధికి సైతం దూరమవ్వడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. 1-19 సర్కులర్‌ను అమలు చేయాలని, పాత పద్ధతిలోనే 'హెల్త్' విధానాన్ని అమలు చేయాలంటూ ఆర్‌టిసి కార్మికులు రిలే దీక్షలకు దిగారు. ఎంటిఎస్ అమలు చేయాలంటూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న సిహెచ్‌ఒలు సమ్మెకు పూనుకున్నారు. మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో, నెలకు వేతనం రూ.7,800 మాత్రమే ఇస్తున్నారని, కాంట్రాక్టు గడువు ముగుస్తున్నందున్న ప్రభుత్వమే 102 వాహనాలను నిర్వహించాలంటూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లు తాజాగా ఆందోళనకు దిగారు. కాకినాడ పోర్టులో ఎగుమతులు, దిగుమతులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ పోర్టుకార్మికులు వేడుకుంటున్నారు. ఇక స్కీమ్ వర్కర్ల సమస్యల పరిస్థితి సరేసరి. వారి సమస్యలను పరిష్కరించిన దాఖలాలు ఎక్కడా లేవు. ఈ నేపథ్యంలో జరిగిన మేడే వేడుకలు ఈ సారి ప్రత్యేకం. సమస్యలను ఎదుర్కొంటున్న ప్రతి శ్రామికుడూ, ఉద్యోగులూ, స్కీమ్ వర్కర్లు పార్టీలు, సంఘాలకు అతీతంగా మేడే ఉత్సవాలను నిర్వహించారు. అంతే కాకుండా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు ప్రతిన బూనారు. మేడే రోజున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎర్రజెండాలు రెపరెపలాడాయి. మేడే పురస్కరించుకుని గతంలో నిర్వహించిన పోరాటాలను గుర్తు చేసుకుని స్ఫూర్తిని పొందారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఈ సందర్భంగా నాయకులు వివరించారు. కార్మిక సంఘాలు దశాబ్దాల క్రితం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్న విషయం విదితమే. ట్రేడ్ యూనియన్ చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, ఫ్యాక్టరీ చట్టం, ప్రావిడెంట్ ఫండ్ చట్టం వంటివి రద్దు చేస్తున్నారు. ఈ చట్టాల పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టబోయే సమ్మెకు సన్నద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

తుని పంచాయితీకి తెర

తుని మున్సిపాలిటీలో నెలకొన్న పంచాయితీకి ఎట్టకేలకు తెరపడింది. తుని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు ఏకగ్రీవమైంది. గతంలో వైసిపి సర్కారు హయాంలో ఈ మున్సిపాలిటీలో అన్ని స్థానాలను ఆ పార్టీ గెలుచుకుంది. అనంతరం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. దీంతో మున్సిపాలిటీపై పట్టుకోసం అక్కడి టిడిపి నాయకులు నానా రభస చేశారు. పలుమార్లు వైస్ చైర్మన్ ఎన్నికను అడ్డుకున్నారు. ఒక్క కౌన్సిలర్ కూడా లేనప్పటికీ నాయకులు సమావేశాన్ని అడ్డుకోవడం గమనార్హం. చివరికి చైర్‌పర్సన్ సైతం రాజీనామా చేసేలా చేయడంలో సఫలీకృతులయ్యారు. ఎట్టకేలకు కొంత మంది కౌన్సిలర్లను చేజిక్కించుకున్న కూటమి నాయకులు తాజాగా అక్కడ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా తమ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా పావులు కదిపారు. ప్రస్తుతం అక్కడ చైర్మన్‌గా నార్ల భువనేశ్వరిసుందర, వైస్ చైర్మన్‌గా ఆచంట సురేష్ ఎన్నికయ్యారు.

డిసిసిబి పీఠంపై తొలగని ఉత్కంఠ

ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డిసిసిబి) చైర్మన్ పదవిపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని డిసిసిబి చైర్మన్ల జాబితాను ప్రకటించిన విషయం విదితమే. అయితే జిల్లాతో పాటు మరో రెండు జిల్లాల చైర్మన్ల ఖరారుపై సందిగ్ధత నెలకొంది. కూటమిలో భాగస్వామ్య పార్టీలైన జనసేన, టిడిపి ముఖ్యనేతలు పోటీపడటమే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. జనసేన పార్టీ నుంచి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు ఇస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేనకు, తూర్పుగోదావరి జిల్లాలో డిసిసిబి అధ్యక్ష పదవి టిడిపికి ఇచ్చేందుకు తొలుత పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. అయితే మారిన సమీకరణల నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా డిసిసిబి చైర్మన్ పదవి టిడిపిని వరించింది. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా డిసిసిబి పదవి జనసేనకు కేటాయించినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నేడో, రేపో దీనిపై అధికారిక ప్రకటన కూడా వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణుల్లో ఆశిస్తున్నాయి.

కోనసీమలో 'సింహాచలం' విషాదం

విశాఖ జిల్లా సింహాచలం దేవస్థానంలో గోడకూలి పలువురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో విషాదం నెలకొంది. చేతికందొచ్చిన కుమారులు దైవదర్శనానికి వెళ్లి మృత్యుఒడికి తిరిగిరావడాన్ని వారి తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. అక్కడ గోడ నిర్మించిన కాంట్రాక్టరే అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 'ప్రసాద్' పథకంలో పలు అభివృద్ధి పనులు చేజిక్కించుకున్నారు. వర్షానికి నానడం వల్లే గోడకూలిందని కమిటీ తేల్చినప్పటికీ, గోడ నాణ్యతా పనులపై చర్చ జరుగుతోంది.

నేరాలు ఘోరాలు



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి బిందుమాధవ్

వీడిన హత్య కేసు మిస్టరీ -భార్యే హంతకురాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల చేబ్రోలు బైపాస్ రోడ్‌లో హత్య చేసి పడవేసిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ధర్మవరానికి చెందిన తంగెళ్ల లోవరాజును భార్య ఆమె ప్రియుడు మరో వ్యక్తితో కలిసి కత్తులతో పొడిచి హత్య చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. శనివారం జిల్లా ఎస్‌పి బిందుమాధవ్ గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు తెలిపారు. చేబ్రోలు గ్రామ శివారు బైపాస్ రోడ్‌లో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ క్యాంప్ కార్యాలయం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు మార్చి 3న పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని గుర్తుపట్టే వీల్లేకుండా శరీరంపై కత్తిపోట్ల ఆనవాళ్లు ఉండడంతో హత్యగా నిర్ధారించారు. మృతుని చేతికి ఉన్న రాగి కడియం, అల్లికతో ఉన్న తాడు తప్ప మరే ఆధారం లేదు. డిఎస్‌పి దేవరాజ్ మనీష్ పాటిల్, సిఐ జి.శ్రీనివాస్ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు విచారణ చేపట్టాయి. యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదుపై గొల్లప్రోలు పోలీసులకు సమాచారం రాగా సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ దర్యాప్తు చేపట్టారు.

యలమంచిలి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన తంగెళ్ల లోవరాజుకు ఏలూరుకు చెందిన శ్యామలతో వివాహం అయ్యింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్యామలకు వరసకు బావ అయ్యే మాడెం మోహన్ కుమార్‌తో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఇది గమనించిన భర్త లోవరాజు భార్యతో పాటు మోహన్ కుమార్‌ను హెచ్చరించాడు. దీంతో భార్య శ్యామల, ప్రియుడు మోహన్ కుమార్, అతడి స్నేహితుడు బల్ల గంగాధర్ రావు కలిసి లోవరాజును హత్య చేసేందుకు పథకం రచించారు. లోవరాజు కంపెనీలో పని ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోతున్న సమయంలో మోహన్ కుమార్, గంగాధర్‌రావు ఆపరేషన్లకు ఉపయోగించే సర్జికల్ కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారులో తీసుకుని వచ్చి చేబ్రోలు బైపాస్ రోడ్డులో కాలువ ఒడ్డున పడవేశారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు శ్యామల, మోహన్ కుమార్, గంగాధర్‌రావును అరెస్టు చేశారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు గ్రామానికి చెందిన జన్నీ రాంబాబు(50) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడిన ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శనివారం కానూరు అగ్రహారంలో ఎండిన రొయ్యల చెరువులో మట్టి దున్నుతుండగా చెరువుగట్టుపై నుంచి ట్రాక్టర్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడి రాంబాబు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కొవ్వూరు

స్థానిక గోష్పాద క్షేత్రంలోని లాంచీల రేవు వద్ద గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, వివరాలు తెలిసినవారు కొవ్వూరు పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఆయన కోరారు.

బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి - యానాం

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మంజూరైన బీమా సొమ్మును ఆర్ఎఒ మునిస్వామి బాధిత కుటుంబానికి అందజేశారు. కురసాంపేటకు చెందిన పాలెపు దుర్గాభవాని గత ఏడాది సెప్టెంబర్ 13న ఇంటివద్ద చీరకు నిప్పంటుకోవడంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. గ్రూప్ ఇన్సూరెన్స్ సొమ్ము రూ.5 లక్షలు విలువ చేసే పత్రాలను మృతురాలి కుమార్తె గాయత్రి ప్రణీతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఎడి గొంతియ్య పాల్గొన్నారు.

నేడు నీట్ పరీక్ష

ప్రజాశక్తి - యానాం

ఆదివారం జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణకు యానాం మెట్టకూరులో జవహర్ నవోదయ విద్యాలయాన్ని కేంద్రంగా ఎంపిక చేయడంతో నిబంధనల మేరకు చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిపాలనాధికారి మునిస్వామి పరిశీలించారు. మొత్తం 134 మంది అభ్యర్థులు ఇక్కడ పరీక్ష రాయనుండగా ఎలాంటి అవకతవకలు జరగకుండా జామర్లు, సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శరత్ చంద్ర కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిళ్లు..వేధింపులు

-జనం తరలించలేదంటూ మెమోలు
-ఇబ్బందుల మధ్య విఒఎలు

ప్రజాశక్తి - సీతానగరం

డ్వాక్రా మహిళలకు, డిఆర్‌డిఎకు మధ్య అనుసంధానకర్తలుగా పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (విఒఎలు)పై రాజకీయ ఒత్తిడులు, వేధింపులతో సతమతమౌతున్నారు. ఒకవైపు ప్రభుత్వ సర్వేలు, రుణాల వసూళ్లు, మరోవైపు అధికారుల సమావేశాలతో వారు సతమతమవుతున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా పగలనక రాత్రనక పని చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే అతి తక్కువ గౌరవవేతనం సైతం సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవి చాల వన్నట్లు రాజకీయ నాయకుల పుట్టినరోజు వేడుకలు, ఎంఎల్ఎలు నిర్వహించే సమావేశాలకు డ్వాక్రా మహిళలను తరలించేందుకు సైతం వీరు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అలా చేయని వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారు. తాజాగా అమరావతి పున్ణప్రారంభ సభకు జనాలను తరలించే బాధ్యతను వీరికి అప్పగించారు. అయితే జనం అయిష్టత వ్యక్తం చేసిన చోట్ల జనాన్ని బస్సుల్లోకి ఎక్కించడంలో విఫలం అయ్యారంటూ కొందరు విఒఎలకు అధికారులు మెమోలు జారీ చేయడం వీరిని మరింతగా ఆవేదనకు గురిచేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొందరు విఒఎలను వైసిపి సానుభూతి పరులుగా గుర్తించి ఉద్యోగాలను తొలగించారు. ప్రస్తుతం సిఎం, మంత్రులు, ఎంఎల్ఎల సభలకు జనాన్ని తీసుకురావడం లేదంటూ మెమోలు జారీ చేయడం దారుణమనే అభిప్రా యాలు వ్యక్తం అవుతున్నాయి. వీటికితోడు రెడ్ క్రాస్ పేరుతో ప్రతీ విఒఎ రూ.1100 చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడాన్ని వారు తప్పుపడుతున్నారు. వేధింపులు, ఒత్తిడిని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విఒఎలు కోరుతున్నారు.

ఇష్టంతో అర్థం చేసుకోవాలి

ప్రజాశక్తి - నల్లజర్ల, సీతానగరం



నల్లజర్ల గ్రంథాలయంలో శిక్షణ ఇస్తున్న ఖాన్‌బాజీ

ఏదైనా సబ్జెక్టును ఇష్టంతో అర్థం చేసుకోవాలని రిసోర్స్‌పర్సన్ ఎస్‌కె.ఖాన్‌బాజీ అన్నారు. శనివారం నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆయన గణితం సబ్జెక్టుపై వివరించారు. గణితం అనగానే పిల్లలు భయపడతారని, కానీ దాన్ని తెలుసుకోవాలనే కోరిక కలిగితే అంత సులువైన సబ్జెక్టు మరొకటి ఉండదన్నారు. ఇష్టంతో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే గణితం అంటే ఇంతేనా అనిపిస్తుందని, గణితంలో సులువైన పద్ధతులను ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పరిశీలకులు ఎవి.రమణ, గ్రంథాలయ ఛైర్మన్ జి.సుశీల, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీతానగరం శాఖా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా కార్యక్రమంలో గ్రాంథాలయధికారి టి.అరుణ్‌కుమార్ విద్యార్థులకు ఆసక్తికరమైన కథలను వినిపించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సహాయ సంక్షేమ అధికారి ఒఎన్.సురేష్‌బాబు పాల్గొని ఆంగ్లం, తెలుగు, హిందీ భాషల ప్రాముఖ్యతను వివరించారు.

పలువురికి తోట నరసింహం పరామర్శ

ప్రజాశక్తి - గోకవరం



బూలా అబ్బులును పరామర్శిస్తున్న తోట నరసింహం

మండలంలోని వివిధ గ్రామాల్లో పలువురిని మాజీ మంత్రి, నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తోట నరసింహం పరామర్శించారు. తిరుమలాయపాలెంలో ఉప సర్పంచ్ దాకారపు దుర్గాప్రసాద్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు షేక్ హుస్సేన్ బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయా కుటుంబాలను ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన బూల అబ్బులు ఇటీవల పాము కాటుకు గురయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించారు. గోకవరం సంజీవయ్య నగర్‌కి చెందిన బిజ్జి రాజు కాలికి శాస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వారిని ఆయన పరామర్శించారు. అనంతరం పితృవియోగం చెందిన ఎస్ఎస్.అలీషాను తోట నరసింహం పరామర్శించారు. ఈ పర్యటనలో వైసిపి నాయకులు గుల్లా ఏడుకొండలు, పాటి రాంబాబు, సుంకర వీరబాబు, సుంకర రమణ, సమ్మిటి నాని, మడికి మైనర్‌బాబు, బడితబోయిన చిన్నా, నరాలశెట్టి నరసయ్య, బత్తుల వెంకట రామకృష్ణ, దంగేటి వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ బాల్ విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి - చాగల్లు



విజేతలను అభినందస్తున్న ఉపాధ్యాయులు

సబ్ జూనియర్స్ టార్గెట్ బాల్ జాతి స్థాయి పోటీల్లో బంగారు పతకం గెలుచుకున్న చాగల్లు విద్యార్థులకు జడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం డి.మోహన్‌కృష్ణ, ఎస్ఎంసి ఛైర్మన్ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే చాగల్లు గ్రామస్తులు విజేతలను ఘనంగా సత్కరించారు.

నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- 8 కేంద్రాల్లో 2,760 మంది అభ్యర్థులు హాజరు
- ఉదయం 8 గంటల నుంచి ఆర్‌టిసి సేవలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షలకు అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. విద్యార్థులు ముందుగా పరీక్షా కేంద్రంలోకి చేరుకోవాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇవ్వరు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి. జిల్లాలో మొత్తం 8 కేంద్రాల్లో 2760 మంది అభ్యర్థులు నీట్ పరీక్షలు రాయనున్నారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలు రవాణా చేసే సమయంలో తగిన బందోబస్త్ కేటాయించారు. పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్య నిర్వహణా కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం కల్పించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పరీక్షా కేంద్రాల వద్ద తగిన విధంగా శానిటరీ, విద్యుత్ సరఫరా, మెడికల్ క్యాంపు, ఫ్రిస్కింగ్ ఏర్పాట్లు కోసం తగిన సిబ్బందిని నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని బస్ స్టేషన్‌ల నుంచి సంబంధిత పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు బస్సు లు తిరిగే విధంగా చర్యలు చేపట్టారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు వైద్య సహాయం అందించడానికి పరీక్షా కేంద్రాల వద్ద మె డికల్ కిట్లు మరియు ఒఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్య సిబ్బందిని కేటాయించారు.

మాజీ విఆర్ఒ శేషగిరిరావు మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం



మండలంలోని వెలగదుర్రు గ్రామానికి చెందిన విశ్రాంత విఆర్ఒ నండూరి శేషగిరిరావు(81) శనివారం మృతి చెందారు. ఈయన 1983 నుంచి 10 ఏళ్ల పాటు తాడిపర్రు, వెలగదుర్రు గ్రామాలకు కర్ణంగా సేవలు అందించారు. అనంతరం విఆర్ఒగా బాధ్యతలు చేపట్టి, ఉద్యోగ విరమణ చేశారు. ఆయన కుమారుడు నండూరి వరప్రసాద్‌ను పలువురు ప్రముఖులు, ఉద్యోగులు పరామర్శించి, శేషగిరిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు



చెక్కును అందిస్తున్న హరిబాబు

మండలంలో ఏడు కుటుంబాలకు రూ.13 లక్షల విలువ చేసే చెక్కులను ఎఎంసి మాజీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. చాగల్లు, బ్రాహ్మణగూడెం, నేలటూరు, నందిగంపాడు గ్రామాలకు చెందిన ఏడు కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దొంగ రామకృష్ణ, గారపాటి సుబ్బారావు, భగత్ మాధవ్, నందిగాం సుబ్బారావు, గారపాటి మారుతిరావు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - నల్లజర్ల

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న వయసులో బాలికలకు వివాహం చేయటం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు.కిశోర బాలికలు ఒకరిని ఒకరు పరిచయం, లక్ష్యాలు నిర్ధారించుకోవడంపై నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.వెంకటలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో జిఎంఎస్‌కెకె.సౌజన్య, పంచాయితీ కార్యదర్శి గిరిజ, ఎఎన్ఎం రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

-ఇసుకాసురులకు స్థానిక నేతల అండ
-పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - సీతానగరం



ట్రాక్టర్‌పై ఇసుకను తరలిస్తున్న ఇసుకాసురులు

మండలంలోని ముగ్గుళ్ళ ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. స్థానిక కూటమి నాయకుల అండదండలతో ఇసుక మాఫియా చెలరేగిపోతుండటంతో ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు అవుతున్నాయి. ముగ్గుళ్ళలో అనుమతి లేని ఇసుక ర్యాంపులు వెలిశాయి. ఇక్కడ నుంచి నిత్యం వందలాది టన్నుల ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ఈ అక్రమ వ్యాపారం వెనుక స్థానిక అధికార పార్టీకి చెందిన కొందరు కీలక నాయకుల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి అండదండలతో ఇసుక మాఫియా రెచ్చిపోతూ, దూర ప్రాంతాలకు సైతం ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటోంది. స్థానికులు అక్రమ ఇసుక రవాణాపై ఫిర్యాదు చేసినా, అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడైనా గొడవ జరిగినప్పుడు హడావుడిగా తూతూ మంత్రంగా ర్యాంపులను మూసివేశామని అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే మరుసటి రోజు నుంచే మళ్లీ యథావిధిగా ఇసుక వ్యాపారం కొనసాగడం గమనార్హం. దీంతో అధికారుల చర్యలు కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకేనని స్పష్టమవుతోంది. అక్రమ ఇసుక రవాణా వల్ల స్థానిక రహదారులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. భారీ లారీలతో, ట్రాక్టర్లు నిత్యం రాకపోకలు సాగించడం వల్ల రోడ్లు గుంతలమయంగా మారాయి. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఇసుకను అక్రమంగా తవ్వడం వల్ల పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. స్థానిక కూటమి నాయకుల అండదండలు ఉండటంతో, అక్రమ ఇసుక వ్యాపారాన్ని అడ్డుకునేందుకు సామాన్య ప్రజలు భయపడుతున్నారు. ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు ఉండకపోగా, తమకే ఏదైనా ఇబ్బంది కలుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ముగ్గుళ్ళలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ వ్యాపారానికి సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, అనుమతి లేని ర్యాంపులను శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి - కొత్తపేట



వివరాలు వెల్లడిస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు

నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. దీనిలో భాగంగా కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామానికి రూ.1.45 కోట్లు, ఆలమూరు మండలం మడికి గ్రామానికి రూ.1.14 కోట్లు నిధులు నాబార్డు నిధుల నుంచి ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు.అమలాపురం - రావులపాలెం ప్రధాన రహదారి నుండి మోడేకుర్రు గ్రామానికి, మడికి గ్రామం నుండి చిలకలపాడు గ్రామం వరకూ ఈ రోడ్ల నిర్మాణం చేపడతారని వివరించారు. అత్యవసరమైన కొన్ని గ్రామాల్లోని నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని చెప్పారు.వాటి నిధుల మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కొత్తపేట పంచాయితీ పరిధిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు ఎంఎల్ఎ ఒడారు సత్యానందరావు స్థలాన్ని పరిశీలించారు.ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని రైతు బజార్ ప్రక్కన ఉన్న సత్రంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు. బూసి భాస్కరరావు , కొత్తపేట గ్రామం ఉప సర్పంచ్ వీళ్ళ మారుతి ప్రసాద్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

12న మహా రణభేరి కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఐ.పోలవరం



కరపత్రం ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

పాతఇంజరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎదుర్లంక వారధి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు ఆధ్వర్యంలో జరిగే మాలల మహా రణభేరి-మే 12న ఛలో కాకినాడ కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు.మాల మహానాడు నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ చేస్తూ ఆర్డినెన్స్ ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు గైడ్ లెన్స్ కు వ్యతిరేకంగా చట్టబద్ధత లేని డేటాతో ఒన్‌మాన్ కమీషన్ ఇచ్చిన రిపోర్టు ఆదారంగా చేసిన ఎస్‌సి వర్గీకరణ చెల్లదన్నారు. దీనికి నిరసనగా జరిగే సభకు మాలలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేవు శ్రీను, పెయ్యల పరాశరాముడు, కాశి పరివాజ్ కుమార్, మట్టా గగనవీరుడు, బీర సత్యనారాయణ, జల్లి శ్రీనివాస్, యలమంచిలి బాలరాజు, వడ్డి గౌతమ్, పండు విజయ్ కుమార్, ములపర్తి శ్రీను, కొండేపూడి సురేష్, సాధనాల బాబురావు,వెంటపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.